

నాగార్జున, విజయ్ బిన్నీ, అల్లరి నరేష్

## అందమైన పాటలా అద్భుతంగా తీశారు

విజయ్ బిన్నీ 'నా సామిరంగ' సినిమాను అందమైన పాటలా చాలా అద్భుతంగా తీశారని అగ్ర కథానాయకుడు అక్కినేని నాగార్జున అన్నారు. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస చిట్టూరి నిర్మించారు. కొరియోగ్రాఫర్ నేపథ్యమున్న విజయ్ బిన్నీ ఈ సినిమాకు దర్శకుడిగా వ్యవహరించారు. సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదలై చక్కటి టాక్‌తో ప్రేక్షకులను అలరిస్తోంది. ఈ నేపథ్యంలో తెలుగు ఫిల్మ్, టీవీ డ్యాన్సర్స్, డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ గురువారం అభినందన సభ ఏర్పాటుచేసింది. నాగార్జున, అల్లరి నరేశ్ ముఖ్య అతిథులుగా హాజరైన ఈ కంగ్రాట్స్ మీట్‌లో 'నా సామిరంగ' చిత్ర బృందాన్ని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. నాగార్జున మాట్లాడుతూ 'విజయ్‌తో పనిచేయడం అద్భుత అనుభవాన్నిచ్చింది. మా అందరినీ చాలా జాగ్రత్తగా చూసుకుంటూ కళ్లు మూసి తెరిచేలోగా చక్కగా సినిమాను పూర్తిచేశాడు.. ఒక పాటలా చాలా అందంగా తీశాడు. కొరియోగ్రాఫర్ అనిపించుకున్నాడు. నేను 95కు పైగా సినిమాలు చేశాను. క్లారిటీతో ఉన్న అతికొద్ది మంది దర్శకుల్లో విజయ్ ఒకరు. విజయ్‌కి, డ్యాన్సర్స్ అసోసియేషన్‌కి ఆల్ ది బెస్ట్' అని చెప్పారు. 'నాగార్జున గారు ఇచ్చిన ప్రేమను మర్చిపోలేను. ఆయనే నన్ను దర్శకుడిని చేశారు. డైరెక్టర్ కావాలని ఆశపడుతున్న చాలా మంది కొరియోగ్రాఫర్స్‌కి అందరి సపోర్ట్ కావాలి' అని దర్శకుడు విజయ్ బిన్నీ అన్నారు. కార్యక్రమంలో శేఖర్ మాస్టర్, సుజాత మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

## వరుణ్‌ధావన్ 'బేబీ జాన్'

షారుఖ్‌ఖాన్ కథానాయకుడిగా నటించిన 'జవాన్' చిత్రంతో బాలీవుడ్‌లో కూడా అగ్రశ్రేణి దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు అట్లీ. గత ఏడాది అత్యధిక వసూళ్లను సాధించిన సినిమాగా 'జవాన్' రికార్డు సృష్టించింది. ప్రస్తుతం అట్లీ హిందీలో వరుణ్‌ధావన్ కథానాయకుడిగా ఓ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. గత ఏడాది ఆగస్టులో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లింది. త్వరలో టీజర్‌ను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి 'బేబీ జాన్' అనే టైటిల్‌ను ఖరారు చేయబోతున్నారని తెలిసింది. అట్లీ దర్శకత్వంలో దళపతి విజయ్ నటించిన 'తేరి' చిత్రానికి రీమేక్ ఇది. కీర్తి సురేష్, వామికా గబ్బి, జాకీష్రాఫ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. కాలిస్ దర్శకత్వం వహిస్తుండగా అట్లీ పర్యవేక్షణలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. నిర్మాతగా తనకిది తొలి సినిమా కావడంతో అట్లీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెబుతున్నారు. వేసవిలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.





మృణాల్ ఠాకూర్



## కమల్ 233 ప్రాజెక్ట్ ఆగిపోయిందా?

అగ్ర కథానాయకుడు కమల్‌హాసన్ 'విక్రమ్' తర్వాత కెరీర్‌లో స్పీడ్ పెంచారు. వరుసగా సినిమాల్ని పట్టాలెక్కిస్తున్నారు. అయితే ఆయన గురించిన ఓ తాజా కబురు ఒకటి నెట్టింట ఆసక్తికర చర్చకు దారి తీసింది. కమల్‌హాసన్ నటించనున్న ఓ ప్రాజెక్టు గురించి ఆ చిత్ర నిర్మాణ సంస్థ ఎక్స్ వేదికగా చేసిన పోస్ట్ ఈ ప్రచారానికి బలాన్ని చేకూర్చుతోంది. కమల్‌కు చెందిన నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్‌నేషనల్ హెచ్. వినోద్ దర్శకత్వంలో ఓ చిత్రాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. కమల్‌హాసన్ నటిస్తున్న 233 సినిమా ఇది. కమల్‌హాసన్‌ను దృష్టిలో ఉంచుకొని దర్శకుడు వినోద్ పవర్‌ఫుల్ కథను సిద్ధం చేసినట్లు అప్పట్లో వార్తలు కూడా వచ్చాయి. ఈ సినిమా ఆగిపోయిందంటూ ఇటీవల జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇదిలావుండగా తమ బ్యానర్‌లో రానున్న సినిమాలను ఉద్దేశించి రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్‌నేషనల్ తాజాగా ఎక్స్‌లో చేసిన పోస్ట్‌తో ఆ ప్రచారానికి ఊతమిచ్చినట్లయింది. 'థగ్‌లైఫ్', 'కమల్ 237', 'శివకార్తికేయన్ 21', 'శింబు 48' త్వరలో తమ బ్యానర్ నుంచి విడుదల కానున్నట్లు పోస్టులో పేర్కొంది. 'కమల్ 233' ప్రాజెక్ట్ ఈ జాబితాలో లేకపోవడంతో అది ఆగిపోయిందని, అందుకే దాని ప్రస్తావన తాజా పోస్టులో లేదనే కథనాలు సోషల్ మీడియా, వెబ్‌సైట్లలో వెలువడుతున్నాయి.



సుధీర్ ఈదర, అనురాగ్, బాపినీడు, వీకే నరేష్

## డ్రీమ్ ఫార్మర్స్ ప్రొడక్షన్ కొత్త చిత్రం

అశోకవనంలో అర్జున కల్యాణం, భామా కలాపం వంటి చిత్రాలను నిర్మించిన డ్రీమ్ ఫార్మర్స్ సంస్థ మరో కొత్త చిత్రాన్ని ఆరంభించింది. ఈటీవీ విన్ సహకారంతో బాపినీడు, సుధీర్ ఈదర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సీనియర్ నటుడు నరేష్ విజయ్ కృష్ణ, రాగ్ మయూర్, ప్రియా వడ్లమాని ప్రధాన పాత్రల్ని పోషించనున్నారు. ప్రముఖ హాస్య నటులు బ్రహ్మానందం కీలక పాత్రలో కనిపించనున్నారు. అనురాగ్ పాలుట్ల దర్శకత్వం వహిస్తారు. గురువారం ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభోత్సవం జరుపుకుంది. ముహూర్తపు సన్నివేశానికి క్రియేటివ్ ప్రొడ్యూసర్ తన్మయ్ కెమెరా స్విఛాన్ చేయగా, నిర్మాత రాధ క్లాప్‌నిచ్చారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి కెమెరా: అంకుర్, సంగీతం: హెచ్ ఆర్ విక్రమ్.

## అందుకు గర్వపడుతున్నా

'సీతారామం' చిత్రంతో తెలుగులో అరంగేట్రం చేసి యువతరం హృదయాలను దోచుకుంది మరాఠీ భామ మృణాల్ ఠాకూర్. తెలుగులో ఎంట్రీకి ముందే కొన్ని హిందీ, మరాఠీ సినిమాల్లో నటించినా.. 'సీతారామం' చిత్రమే ఈ అమ్మడి కెరీర్‌కు బ్రేక్‌నిచ్చింది. గత ఏడాది ఆమె నటించిన 'హాయ్ నాన్న' హృద్యమైన కుటుంబ కథగా ప్రేక్షకుల్ని మెప్పించింది. ఈ సినిమా విజయానందాన్ని ఆస్వాదిస్తున్న ఈ భామ తెలుగు చిత్రసీమపై ప్రశంసలు కురిపించింది. బాలీవుడ్‌లో తనకు రొమాంటిక్ చిత్రాల్లో నటించే అవకాశం రాలేదని, తెలుగులో మాత్రం మనసుకు హత్తుకునే ప్రేమకథా చిత్రాల్లో భాగమయ్యానని ఆనందం వ్యక్తం చేసింది. తెలుగు ప్రేక్షకులు తనను క్వీన్ ఆఫ్ రొమాన్స్ అని పిలుస్తున్నారని, అందుకు చాలా గర్వపడుతున్నానని మృణాల్ ఠాకూర్ పేర్కొంది. 'బాలీవుడ్‌లో ఎన్నో అద్భుతమైన లవ్ స్టోరీస్ వచ్చాయి. ఆ సినిమాలు చూస్తూ పెరిగాను. దురదృష్టం కొద్దీ ఆ జోనర్‌లో హిందీ సినిమాలు చేయలేదు. ఆ లోటును తెలుగు పరిశ్రమ తీర్చింది' అని చెప్పుకొచ్చింది మృణాల్ ఠాకూర్. ప్రస్తుతం ఈ భామ విజయ్ దేవరకొండ సరసన 'ఫ్యామిలీ స్టార్' చిత్రంలో నటిస్తున్నది.

## ఎవరూ టచ్ చేయని కాన్సెప్ట్ ఇది!



రవి కస్తూరి

'గేమ్ ఆన్' చిత్రం ద్వారా నిర్మాతగా పరిచయమవుతున్నారు రవి కస్తూరి. గీతానంద్, నేహా సోలంకి జంటగా దయానంద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా నిర్మాత రవి కస్తూరి గురువారం పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్. రియల్ టైం కాన్సెప్ట్‌తో కమర్షియల్ హంగులను జోడించి తెరకెక్కించాం. యాక్షన్‌తో పాటు ఫ్యామిలీ డ్రామా ఉంటుంది. జీవితాన్ని చాలించాలనుకునే వ్యక్తి అనుకోకుండా ఓ గేమ్‌లోకి ఇన్‌వాల్వ్ అయితే అతను ఎలాంటి పరిణామాల్ని ఎదుర్కొన్నాడనేది ఆద్యంతం ఉత్కంఠను పంచుతుంది. ఇప్పటివరకు ఎవరూ టచ్ చేయని వినూత్నమైన కాన్సెప్ట్ ఇది. అందుకే విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నాం. శుభలేఖ సుధాకర్, మధుబాల, ఆదిత్యమీనన్ వంటి సీనియర్ నటులు ఈ కథకు బలంగా నిలిచారు. ఫస్ట్‌కాపీ చూసి థ్రిల్‌గా ఫీలయ్యా. నేను ఆస్ట్రేలియాలో వ్యాపారాలు చేస్తాను. అటు బిజినెస్ ఇటు సినిమాను బ్యాలెన్స్ చేయడం ఛాలెంజింగ్‌గా అనిపించింది. ఈ సినిమా అనుభవం మరో పది సినిమాలు చేయడానికి ఉపయోగపడుతుందని అనుకుంటున్నా. ఇప్పటికే రెండు కథలు విన్నా. త్వరలో ఆ సినిమాల్ని ప్రకటిస్తాం' అన్నారు.




## అభినవ రామచంద్రుడి కథ

కృష్ణవంశీ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. చిలుకూరి ఆకాష్ రెడ్డి దర్శకుడు. హైనినా క్రియేషన్స్ పతాకంపై హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్ర టీజర్‌ను ప్రముఖ నిర్మాత దిల్‌రాజు ఆవిష్కరించారు. 'మా అమ్మ ఎప్పుడు చెప్పేది..మనల్ని ఎవరైనా ప్రేమిస్తే ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా, ఎన్ని కారణాలు అడ్డు వచ్చినా ఆ ప్రేమని చనిపోయేంత వరకు వదులుకోకూడదు' అనే డైలాగ్‌తో మొదలైన టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. 'ఆ రాముడు సీత కోసం ఒక్కసారే యుద్ధం చేశాడు. నా సీత కోసం ప్రతిక్షణం నాతో నేనే యుద్ధం చేస్తున్నా' అనే డైలాగ్ ఆకట్టుకునేలా ఉంది. టీజర్ చాలా బాగుందని, సంభాషణలు హృదయాల్ని కదిలించేలా ఉన్నాయని దిల్ రాజు ప్రశంసించారు. నిజాయితీ కలిగిన ప్రేమికుడి కథ ఇదని దర్శకుడు తెలిపారు. తమ సంస్థకిది తొలి చిత్రమని, ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీగా ఆకట్టుకుంటుందని నిర్మాత పేర్కొన్నారు.



మోక్ష, కృష్ణవంశీ

## యాక్షన్ ఎంటర్‌టైనర్ 'రత్నం'



హీరో విశాల్ అనగానే అటు కోలీవుడ్, ఇటు టాలీవుడ్‌లో ప్రేక్షకులకు గుర్తుకొచ్చేది యాక్షన్ చిత్రాలే. విశాల్ నుంచి రాబోతున్న తదుపరి పూర్తి యాక్షన్ చిత్రం 'రత్నం'. హరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్, స్టోన్ బెంచ్ ఫిల్మ్స్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మించాయి. కార్తికేయన్ సంతానం నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కల్యాణ్ సుబ్రమణ్యం అలంకార్ పాండియన్ సహ నిర్మాత. యూనిట్ ఇప్పటివరకు వెల్లడించిన కంటెంట్‌తో మాస్ లవర్స్‌లో ఈ సినిమాపై అంచనాలు పెరిగాయి. ఫస్ట్ షాట్ టీజర్, పాటలు ఇప్పటికే ఆకట్టుకున్నాయి. షూటింగ్ పూర్తయినట్లు కూడా మేకర్స్ ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ మూవీ రిలీజ్ డేట్‌ను లాక్ చేసింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఏప్రిల్ 26న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలో విశాల్ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. దేవీశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.




